


పాఠశాల ప్రాంగణంలో విద్యార్థినులతో సరదాగా గడుపుతున్న తల్లిదండ్రుల



చిన్నారికి అన్నం తినిపిస్తున్న ఓ తల్లి..



విద్యార్థినుల తలలకు నూనె అంటి జడలు వేస్తున్న తల్లులు

# గోరుముద్దలు తినిపించి..సరదాగా గడిపి..

- జాతరలా కనిపించిన తోలుకట్టా గ్రామ పరిధిలోని గురుకుల పాఠశాల ప్రాంగణం
- ఉదయం 11 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సరదాగా గడిపిన విద్యార్థులు

మండలంలోని తోలుకట్టా గ్రామ పరిధిలో ఉన్న గురుకుల పాఠశాల (ఎస్‌వీ గ్రూప్ ఇన్‌స్టిట్యూట్ ఆవరణ) శనివారం జాతరలా కనిపించింది. ఈ గురుకులం పరిధిలో మూడు మండలాలకు చెందిన మూడు పాఠశాలలు, కళాశాలలున్నాయి. రెండో శనివారాన్ని పురస్కరించుకుని తల్లిదండ్రులు అధికంగా తరలిరావడంతో ఆ ప్రాంతంలోని చెట్ల కింద సందడిగా మారింది. ప్రతినెలా రెండో శనివారమే తమ పిల్లలను కలుసుకునేందుకు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యం అనుమతించడంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు అధికంగా వచ్చి తమ బిడ్డలతో సరదాగా గడిపారు. విద్యార్థినులకు గోరుముద్దలు తినిపించి.. తలకు నూనె అంటి జడలు వేశారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యార్థినులు తల్లిదండ్రులు, అన్నదమ్ములు, చెల్లెళ్లతో కబుర్లు చెప్పుకొని, ఆనందంగా గడిపారు. అమ్మానాన్నలతో సెల్ఫీలు దిగుతూ ఎంజాయ్ చేశారు.

– మొయినాబాద్, ఆగస్టు 10



దేవునిపడకల్ గ్రామంలో వేంకటేశ్వరస్వామి ఆలయ ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి

### వైభవంగా వేంకటేశ్వరస్వామి ఆలయ

# ముఖద్వార ప్రారంభోత్సవం

- పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్, ఆగస్టు 10 : తలకొండపల్లి మండలం దేవునిపడకల్ గ్రామం గేట్ వద్ద నిర్మించిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ముఖద్వార ప్రారంభోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఏకశిలపై దేవతామూర్తులు వెలసిన శ్రీవారి ఆలయంగా జిల్లాలోనే ఈ దేవాలయం ప్రసిద్ధిగాంచింది. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి తన తండ్రి రాంరెడ్డి జ్ఞాపకార్థం..సొంత నిధులతో ఈ ఆలయ ముఖ ద్వారాన్ని నిర్మించారు. శనివారం ఆలయ ముఖద్వారం వద్ద ప్రభాకర్‌రెడ్డి కుటుంబసభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చేతుల మీదుగా ఆలయ ముఖద్వారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి సహకరిస్తామన్నారు. ఆలయానికి ముఖద్వారాన్ని నిర్మించిన ప్రభాకర్‌రెడ్డిని మంత్రి, ఎమ్మెల్యే, నాయకులు అభినందించారు. అంతకుముందు ఎమ్మెల్యే మాట్లాడుతూ మైసిగండి, వెల్జాల్, మల్లప్పగుట్ట ఆలయాలను అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని మంత్రిని కోరారు. కడ్తాల్–తలకొండపల్లి వెళ్లే దారిలో అటవీశాఖకు సంబంధించిన భూములు ఉండడంతో రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయాయని.. వెంటనే సంబంధిత శాఖ నుంచి అనుమతులు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు బాలాజీసింగ్, అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నర్సింహారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, ఆలయ చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ శ్రీశైలం, నాయకులు మోహన్‌రెడ్డి, భగవాన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, భాస్కర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రఘురాములు, రమేశ్, రాము లు, మహేశ్, రవీందర్‌యాదవ్, వెంకటేశ్, బీచ్యానాయక్, బీక్యానాయక్, తహసీల్దార్ రాంరెడ్డి, సీఐ ప్రమోద్‌కుమార్, ఎస్‌ఐలు శ్రీకాంత్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

# సినారె సాహిత్య సేవ అజరామరం

### రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి

తుర్కయాంజాల్, ఆగస్టు 10 : తెలుగు రాష్ట్రాల సాహిత్యానికి డాక్టర్ సి.నారాయణరెడ్డి (సినారె) అందించిన సాహిత్య సేవ చారిత్రాత్మకమైనదని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి అన్నారు. శనివారం తుర్కయాంజాల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన మహాకవి సినారె కళాపీఠం సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్రలకు చెందిన పలువురు సాహితీవేత్తలకు పురస్కారాలను అందజేసి మాట్లాడారు. సినారె భౌతికంగా మన మధ్య లేకున్నా ఆయన కవిత్వం అజరామమరమని చిన్నారెడ్డి పేర్కొన్నారు. ముఖ్యంగా సినీ గేయ సాహిత్యం సాహిత్య ప్రేమికులతో పాటు సామాన్యుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని ఏర్పర్చుకుందన్నారు. సినారె లేరు కానీ ఆయన మాట, పాటలు ఇంకా బతికే ఉన్నాయన్నారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ నందిని సిధారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ భాష సాంస్కృతిక మండలి అధ్యక్షుడు డాక్టర్ గంటా జలంధర్ రెడ్డి, సాహితీవేత్తలు దయానందరెడ్డి, తేజ సాహిత్య సేవా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పోరెడ్డి రంగయ్య, కార్యక్రమ నిర్వాహకులు మహాకవి సినారె కళాపీఠం అధ్యక్షుడు మల్లకేడి రాములు, ప్రజాప్రతినిధులు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలకు చెందిన ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ గౌరీ శంకర్ (హైదరాబాద్), వైహెచ్‌కే మోహన్‌రావు(పల్నాడు–గుంటూరు), సంగేనేని రవీందర్ (ముంబయి–మహారాష్ట్ర), డాక్టర్ చిదేళ్ళ సీతాలక్ష్మి(హైదరాబాద్), కన్నోజు లక్ష్మీకాంతం(హైదరాబాద్), సమ్మెట ఉమాదేవి (ఖమ్మం), బూర్ల వెంకటేశ్వర్లు (కరీంనగర్), బిల్ల మహేందర్ (వరంగల్), డాక్టర్ నరేశ్ రావు (నిజామాబాద్), ధ్యావరి నరేందర్‌రెడ్డి (రంగారెడ్డి)లకు మహాకవి సినారె సాహిత్య పురస్కారాలను చిన్నారెడ్డి, సిధారెడ్డి, జలంధర్‌రెడ్డి, పోరెడ్డి రంగయ్య, మల్లెకేడి రాములు అందజేశారు.

#### ధ్యావరి నరేందర్‌రెడ్డికి..

పెద్దేముల్ : హైదరాబాద్‌కు చెందిన మహాకవి సినారె కళాపీఠం వారు డాక్టర్ సి.నారాయణరెడ్డి 93వ జయంతి సందర్భంగా పెద్దేముల్ జడ్పీహెచ్‌ఎస్‌లో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న గజల్‌కవి ధ్యావరి నరేందర్‌రెడ్డికి సినారె సాహిత్య పురస్కారాన్ని అందించారు. తెలుగు సాహిత్యంలో రెండు దశాబ్దాలుగా చేస్తున్న కృషికిగానూ ఈ అవార్డును ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సినారె సేవా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పోరెడ్డి రంగయ్య తదితరులు పాల్గొన్నారు. నరేందర్‌రెడ్డికి సినారె సాహిత్య పురస్కారం వరించడంపై తాండూరు కళాభారతి సాహిత్య వేదిక అధ్యక్షుడు రామకృష్ణరాజు, ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్, వెంకట్‌రెడ్డి, జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు సునీత, ఉపాధ్యాయులు, వికారాబాద్ జిల్లా గెజిటెడ్ లెక్చరర్స్ అధ్యక్షుడు మహేందర్ వర్షం వ్యక్తం చేశారు.



సినారె సాహిత్య పురస్కారాన్ని అందుకుంటున్న ప్రముఖ గజల్ కవి ధ్యావరి నరేందర్‌రెడ్డి

# పిచ్చి కుక్క స్వైర విహారం

### ముగ్గురు చిన్నారులతో సహా ఐదుగురిపై దాడి

యాచారం, ఆగస్టు 10 : మండల కేంద్రంలో శనివారం ఉదయం ఓ పిచ్చి కుక్క రెచ్చిపోయింది. ఒకేసారి ఐదుగురిని గాయపర్చింది. అం దులో ముగ్గురు చిన్నారులు, ఓ దివ్యాంగుడు, మహిళ ఉన్నారు. దీంతో గ్రామస్తులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. పిచ్చి కుక్క స్వైరవిహారం చేస్తూ ఎల్లమ్మ గుడి కాలనీకి చెందిన ముగ్గురు చిన్నారులు లడ్డు, లోకేశ్, ఎంజిలీనాలపైకి వెళ్లి చేతులు, కాళ్లపై విచక్షణారహితంగా కరిచింది. అదేవిధంగా మేడిపల్లి గ్రా మానికి చెందిన నరసింహచారి అనే దివ్యాంగుడితోసహా యాచారానికి చెందిన స్వాతి అనే మహిళపైనా దాడి చేయగా ఇరువురు స్వల్పంగా గాయపడ్డారు. అప్రమత్తమైన స్థానికులు కర్రలతో ఆ కుక్కను వెంబడించగా తప్పించుకున్నది. బాధితులను ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లి చికిత్స అందించారు. వీధి కుక్కల బారి నుంచి కాపాడాలని ప్రజలను అధికారులను కోరుతున్నారు.



### జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నీ ప్రారంభం



నందిగామ, ఆగస్టు 10 : మండలంలోని చేగూరు గ్రామంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే శంకర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మాజీ చైర్మన్ విఠల్, మాజీ సర్పంచ్ జట్ట కుమార్, మాజీ ఎంపీటీసీలు కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, కుమారస్వామిగౌడ్, నాయకులు నర్సింహ, బుచ్చయ్య, శ్రీశైలం, మల్లేశ్‌గౌడ్, శ్రీశై లం, శేఖర్, భాస్కర్, రవితేజ, కృష్ణ, సురేశ్‌గౌడ్, వేణు, నవీన్‌గౌడ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఓం గణపతియే నమోనమః



కోట్లాది మంది భక్తులకు కొంగుబంగారంగా నిలిచి ప్రతి ఏడాది భిన్నమైన రూపాలతో కనిపించే ఖైరతాబాద్ మహాగణపతి ఈ ఏడాది శ్రీ సప్తముఖ మహాశక్తి గణపతిగా దర్శనమివ్వనున్నారు. 70 అడుగుల ఎత్తు, 28 అడుగుల వెడల్పుతో కనువిందు చేయనున్నారు. వీటితో పాటు కుడివైపు పది అడుగుల అయోధ్య బాలరాముడి విగ్రహం, ఎడమ వైపు తొమ్మిది అడుగుల ఎత్తులో రాహు, కేతుల విగ్రహాలు, మూడు అడుగుల మూషికాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. కుడి వైపు 15 అడుగుల మండపంలో తొమ్మిది అడుగుల ఎత్తులో లక్ష్మి, శ్రీనివాసుడి విగ్రహాలు, ఎడమవైపు మండపంలో అంతే ఎత్తులో పార్వతీపరమేశ్వరుల విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. విగ్రహ నిర్మాణ పనులు చకచకా సాగుతున్నాయి.


### పింక్ సైక్లథాన్




ఆర్మీ వైవ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'ఎంపవర్ ఉమెన్–ఎలివేట్ ఫిట్‌నెస్' థీమ్‌తో శనివారం పింక్ సైక్లథాన్ జరిగింది. అంబేద్కర్ విగ్రహం నుంచి సంజీవయ్య పార్కు వరకు సాగిన సైక్లింగ్ రైడ్‌లో సుమారు 50 మంది మహిళలు పాల్గొన్నారు. – సిటీబ్యూరో

# ఖాకీల కర్కశత్వం..!

- పంజాగుట్ట ఠాణాలో థర్డ్ డిగ్రీ
- చేతులు వెనక్కి విరిచి.. తాళ్లతో కట్టి..
- రబ్బర్ బ్యాట్‌తో కొట్టి చిత్రహింసలు
- కమిలిన గాయాలు..దవాఖానకు తరలింపు
- ఫలహార బండి ఊరేగింపులో రౌడీషీటర్‌ను వదిలి మాపై హత్యాయత్నం కేసు
- విలేకరుల సమావేశంలో గోడువెళ్లబోసుకున్న ముగ్గురు బాధితులు



వెంగళరావునగర్, ఆగస్టు 10 : బోనాల ఫలహార బండి ఊరేగింపులో రెచ్చగొట్టిన రౌడీషీటర్‌ను నియంత్రించకుండా.. అడ్డుకున్న తమను పోలీసులు చిత్రహింసలకు గురిచేసి, థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ముగ్గురు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒళ్లంతా కుళ్లబొడిచి..నోరు తెరిచి న్యాయమూర్తికి చెప్తే గంజాయి కేసు పెడతామని, రౌడీషీట్లు తెరుస్తామంటూ బెదిరించారని తెలిపారు. శనివారం థర్డ్ డిగ్రీకి గురైన ముగ్గురు బాధితులు శివ, నాగేంద్ర, అనిల్‌లు యూసుఫ్‌గూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తమకు జరిగిన అన్యాయంపై ఏకరువు పెట్టారు. ఈ నెల 5న రౌడీషీటర్ బిల్లా పవన్ బోనాల సాకుతో అనుమతిలేని రూట్‌లో ఫలహార బండి ఊరేగింపు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ నాయకుడు నవీన్‌యాదవ్ ఇంటి ముందు రౌడీషీటర్ బిల్లా పవన్ ఓపెన్ టాప్ జీపులో కూర్చుని హుక్కా పీల్చుతూ కవ్వింపు చర్యలకు దిగాడు..దీంతో నవీన్‌యాదవ్ అనుచరులమైన తాము జీపు డ్రైవర్‌ను ముందుకు పోనివ్వాలని కోరగా.. డ్రైవర్‌ను కొట్టామని హత్యాయత్నం పెట్టిన కేసులో ఈ నెల 7న రాత్రి 3 గంటల సమయానికి డివిజన్ నైట్‌డ్యూటీ ఆఫీసర్ జూబ్లీహిల్స్ ఠాణాలో ఇన్‌స్పెక్టర్ ముందు లొంగిపోయాయని.. అక్కడి నుంచి తమను పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారని తెలిపారు. తమతోపాటు మరో 20 మందిపై హత్యాయత్నం కేసు పెట్టారని.. ఇదంతా అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి ఆనందం కోసం పోలీసులు తమను చిత్రహింసలకు గురిచేశారని వాపోయారు.

#### థర్డ్ డిగ్రీ ప్రయోగించిన ఏసీపీ..

రబ్బర్ బ్యాట్‌తో పంజాగుట్ట ఏసీపీ మోహన్‌కుమార్ తమపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని.. మా చేతుల్ని వెనక్కి విరిచి తాడుతో బంధించి.. కుళ్లబొడిచారని, వారి దెబ్బలకు మా ఒళ్లంతా కమిలిన గాయాలయ్యాయని ముగ్గురు బాధితులు వాపోయారు. గొడవలో కాంగ్రెస్ నాయకుడు నవీన్‌యాదవ్, అతడి సోదరుడు వెంకట్‌యాదవ్‌ల ప్రమేయం ఉందని చెప్పాలని తమను చిత్రహింసలకు గురిచేసి బెదిరించారని తెలిపారు. అంతేకాకుండా మధురానగర్ పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి అక్కడి నుంచి యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ వరకు తమను రోడ్డుపై నడిపిస్తూ బహిరంగంగా కాలర్లు పట్టుకుని ఈడ్చుకుంటూ వెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. నోరు తెరిచి న్యాయస్థానంలో చెబితే అక్రమంగా గంజాయి కేసు పెడతామని ఏసీపీ బెదిరించారని తెలిపారు. కోర్టులో సైతం కానిస్టేబుల్ సైగలతో మమ్మల్ని బెదిరించి.. తెల్ల కాగితాలపై సంతకాలు చేయించుకున్నారని బాధితులు తెలిపారు.



పోలీసు కొట్టిన గాయాలను చూపుతున్న నాగేంద్ర

#### ఆరోపణలు అవాస్తవం

నాపై నిందితులు చేస్తున్న ఆరోపణలు అన్నీ అవాస్తవం..నిందితులను మేం కొట్టలేదు. వారు చేసిన ఆరోపణలు నిరాధారమైనవి.. కావాలనే మాపై నిందారోపణలు చేస్తున్నారు. – మోహన్‌కుమార్, పంజాగుట్ట ఏసీపీ

#### ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తాం..

గొడవ గురించి ముందే పోలీసులను చెప్పినా వారు పట్టించుకోలేదు. ఊరేగింపు గంటముందు కూడా మధురానగర్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డికి ఫోన్ చేస్తే స్పందించలేదు. పోలీసుల చేతుల్లో చిత్రహింసలు గురైన ముగ్గురికి మేం వైద్య పరీక్షలు చేయించాం. ఆ రిపోర్టులతో న్యాయస్థానం తలుపు తట్టి న్యాయపోరాటం చేస్తాం. రౌడీషీటర్‌ను నియంత్రించకుండా అతడిని ఊరేగింపులో పాల్గొనేలా సహకరించి ..మా అనుచరులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసుల తీరుపై సీఎం రేవంత్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేస్తాం. –నవీన్ యాదవ్, కాంగ్రెస్ నేత

### హోంగార్డు.. నకిలీ ఎస్సై అరెస్టు

వెంగళరావునగర్: హోంగార్డుతో పాటు నకిలీ ఎస్సైని బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. అన్నపూర్ణ స్టూడియోస్ గేట్ నం.1 ఎదురుగా ఉన్న పాన్‌షాప్ యజమానిని తాము టాస్క్‌ఫోర్స్ పోలీసులమంటూ బెదిరింపులకు గురి చేశారు. 'మీ షాపులో గుట్కాలు అమ్ముతున్నారనే సమాచారం ఉందంటూ... కేసు పెట్టకుండా ఉండేందుకు రూ.5 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనుమానం వచ్చి..వారిద్దర్నీ పట్టుకొని పోలీసులకు అప్పగించారు. నిందితుల్లో ఒకరు సైబరాబాద్ ఎస్‌వోటీలో విధులు నిర్వహించే హోంగార్డు బాదుల్లాగా గుర్తించారు. అతడితో కలిసి వచ్చిన టాస్క్‌ఫోర్స్ నకిలీ ఎస్సై నరసారెడ్డిని కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

### టీజీఎయిమ్స్‌లో సమగ్ర సమాచారం

సిటీబ్యూరో, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ): క్షేత్ర స్థాయిలో విద్యుత్ నెట్‌వర్క్‌ను పర్యవేక్షించేందుకు రూపొందించిన 11 కేవీ ఫీడర్ సర్వేతో మంచి ఫలితాలు సాధించేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ కార్యాచరణ రూపొందించింది. నిరంతరం నాణ్యమైన సరఫరాలో అత్యంత కీలకమైంది క్షేత్ర స్థాయి నెట్‌వర్క్. అందులో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత యంత్రాంగానిదే. ఈ విషయాన్ని గుర్తించిన ఉన్నతాధికారులు.. సుమారు రెండు నెలలపాటు క్షేత్ర స్థాయిలోని ప్రతి ఫీడర్‌లో లైన్లను క్షుణ్ణంగా తనిఖీ చేసి..'టీజీఎయిమ్స్' పేరుతో యాప్‌ను రూపొందించి..అందుబాటులోకి తెచ్చారు. విద్యుత్ ఉద్యోగులు మాత్రమే వినియోగించేలా రూపొందించిన ఈ యాప్‌లో సరఫరాకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని నిక్షిప్తం చేశారు. ఏ ఫీడర్ పరిధిలో సరఫరాకు అంతరాయం కలిగిందో కచ్చితంగా తెలుసుకొని, అక్కడి సెక్షన్ ఎలక్ట్రిక్ అధికారులు..ఫ్యూజ్ ఆఫ్ కాల్ సిబ్బందిని వెంటనే అప్రమత్తం చేసేలా ఆటోమేషన్ వ్యవస్థను రూపొందిస్తున్నట్లు ఓ అధికారి తెలిపారు.

